


ఉపాధి కూలీల బకాయి వేతనాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - తణుకు

ఉపాధి కూలీల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు గత ఏప్రిల్ నుంచి చేసిన పనులకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎంత కష్టపడినప్పటికీ కనీసం రెండు వందలు కూడా రావడం లేదని అన్నారు. సాంకేతిక లోపం వల్ల మస్తర్ చాలా ఆలస్యం అవుతోందన్నారు. కార్మికులకు పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి సౌకర్యాలు ఉండాలన్నారు. చేసిన పని వివరం తెలియడానికి గతంలో ఇచ్చిన పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. పూర్తిగా 100 రోజులు పని కల్పించడం లేదన్నారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, పి.రాజా పాల్గొన్నారు.

ఖరీఫ్ పనులు ముమ్మరం..!

రెండు జిల్లాల్లో 4.30 లక్షల ఎకరాల్లో వరిసాగు
ఇప్పటి వరకూ 60 శాతం నారుమడులు పూర్తి
మెట్టప్రాంతంలో బోర్ల కింద 8 వేల ఎకరాల్లో నాట్లు
ఆగస్టు మొదటివారం వరకూ నాట్లు సాగే పరిస్థితి
కౌలుకార్డుల జారీలో వీడని నిర్లక్ష్యం
పెట్టుబడి సొమ్ము కోసం అన్నదాత అవస్థలు


ఉంగుటూరు మండలం వెలమల్లిలో బోర్ల కింద వేసిన ఖరీఫ్ నాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు పడుతుండటంతో రైతులు నారుమడులు, నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో 'పశ్చిమ'లో 2.11 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 2.19 లక్షల ఎకరాలు మొత్తం రెండు జిల్లాల్లో 4.30 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. జూన్ ఒకటో తేదీనే కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు ముందుకు మాత్రం సాగలేదు. దీంతో జూన్ నెల పూర్తయినా ఇప్పటికీ 60 శాతం మాత్రమే నారుమడులు పూర్తయ్యాయి. గడచిన కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు నారుమడులు ముమ్మరంగా వేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో నారుమడులు పూర్తయ్యే పరిస్థితి కన్పిస్తోంది. మెట్ట ప్రాంతంలో బోర్ల కింద సాగుచేసే రైతులు నారుమడులు ముందుగా వేయడంతో తాడేపల్లిగూడెం, పెదపాడు, ఉంగుటూరు వంటి మండలాల్లో ఇప్పటికే ఎనిమిది వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. మెట్టలో నాట్లు కొనసాగుతుండగా డెల్టాలో ఇంకా నారమడులు పూర్తికాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం నారుమడులు సాగుతున్న పరిస్థితి చూస్తే ఆగస్టు మొదటి వారం వరకూ ఖరీఫ్ నాట్లు కొనసాగే అవకాశం కన్పిస్తోంది. ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమైనప్పటికీ పెట్టుబడులకు సొమ్ము లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రబీ ధాన్యానికి సంబంధించిన సొమ్ము ఇప్పటికీ రైతులకు అందలేదు. ఎప్పటికి ఇస్తారో స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ధాన్యం సొమ్ము పశ్చిమలో రూ.900 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.245 కోట్లు వరకూ రైతులకు అందాల్సి ఉంది. ధాన్యం సొమ్ము అందకపోవడంతో రబీలో పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులను రైతులు తీర్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేకపోవడంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం డబ్బు కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదరుచూస్తున్నారు.

కౌలుకార్డుల జారీ పూర్తయ్యేదెప్పుడో..!

కౌలురైతులకు బ్యాంకు రుణాలు అందని ద్రాక్షగా మారాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమై నాట్లు ప్రారంభమైనా ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. ఈ ఏడాది పశ్చిమలో లక్షా ఆరు వేలు, ఏలూరు జిల్లాలో 76 వేలు మంది రైతులకు కౌలుకార్డులు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ పట్టుమని రెండు వేల మందికి కూడా కౌలుకార్డుల జారీప్రక్రియ సాగలేదు. కౌలుకార్డులు అందజేత ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కౌలుకార్డు లేకపోతే బ్యాంకుల నుంచి పంటరుణాలు అందే పరిస్థితి ఉండదు. దీంతో కౌలురైతులు పెట్టుబడుల కోసం నానావస్థలు పడుతున్నారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కౌలురైతులుకు వెంటనే కౌలుకార్డులు జారీ చేసి బ్యాంకు రుణాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాత కోరుతున్నాడు. అదేవిధంగా ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు కౌలురైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అప్పుడే ఖరీఫ్ సాగులో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

వార్డుల్లో మంత్రి నిమ్మల పింఛన్ల పంపిణీ


పింఛన్ సొమ్ము అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 17, 23వ వార్డులో పెంచిన సామాజిక, వికలాంగుల పింఛన్లను రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పంపిణీ చేశారు. ఐదేళ్లలో వికలాంగులకు రూ.9 లక్షలు అందుతాయని చెప్పారు. పట్టణంలోని 23వ వార్డులో వికలాంగునికి పెన్షన్ సొమ్ము రూ.15 వేలు అందజేశారు. నూరు శాతం వికలాంగులకు ఇచ్చే రూ.5000 పెన్షన్ రూ.15 వేలకు పెంచామని, ఐదేళ్లలో రూ.9 లక్షలు వస్తుందని పేర్కొన్నారు. తమకు ఏ పథకం వచ్చినా మీ వల్లే వచ్చిందని, జగన్ ప్రభుత్వంలో రూపాయి లబ్ధి కూడా అందలేదని లబ్ధిదారుని కుటుంబ సభ్యులు మంత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

2,32,885 మందికి పింఛను సొమ్ము పంపిణీ

జిల్లా కలెక్టర్ నాగరాణి


పింఛన్ సొమ్ము అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

వృద్ధులకు, వికలాం గులకు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. కుముదవల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎన్‌టిఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జూన్ నెలకు సంబంధించి పింఛన్ రూ.4 వేలతో పాటు, ఏప్రిల్ నుంచి జూన్ వరకూ మూడు నెలలకు గాను రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.7 వేలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన నగదును సరైన రీతిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందన్నారు. పాలకోడేరు మండలంలో 9,390 మందికి రూ.6.07 కోట్లు పింఛను అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో 2,32,885 మంది పింఛనుదారులకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా జులై నెలకు రూ.155.71 కోట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హులైన పెన్షన్‌దారులకు ఉదయం 6.00 గంటలకే ఇంటింటికీ వెళ్లి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించామన్నారు. జిల్లాలోని 2,32,885 మంది పింఛనుదారులకు జూన్ వరకూ రూ.69.05 కోట్లు పంపిణీ కాగా, జులైలో 15 రకాల పింఛనుదారులకు అదనంగా పెంచిన మొత్తంతో కలిపి రూ.97.69 కోట్లు, 10 రకాల పింఛనుదారులకు ఏప్రిల్ నుంచి రూ.1000 చొప్పున ఏరియల్ మూడు నెలలకు రూ.3 వేలు కలిపి మొత్తం రూ.58.01 కోట్లు వెరసి మొత్తం రూ.155.71 కోట్లు పంపిణీ జరుగుతుందన్నారు. వికలాంగులకు, మల్టీ డిఫార్మిటీ లెప్రసీ దారులకు రూ.3 వేల నుండి రూ.6 వేలు, కిడ్నీ, లివర్, హార్ట్ మార్పిడి రోగులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, పక్షవాతం వచ్చిన వ్యక్తి చక్రాల కుర్చీ లేదా మంచానికి పరిమితమైన వారికి, తీవ్రమైన మస్కులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితులకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఎపిఒ టి.మురళీకృష్ణ, తహశీల్దార్ నాగార్జున, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచి భూపతిరాజు కృష్ణంరాజు, ఉపసర్పంచి వడ్లపూడి బాబ్జి, స్థానిక నాయకులు మధుసూధన రాజు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను అమలు చేయొద్దు

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - నరసాపురం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని నరసాపురం న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్యనాయుడు మాట్లాడుతూ హడావుడిగా ఈ చట్టాలను అమలు చేయడం వల్ల న్యాయ ప్రక్రియకు విఘాతం ఏర్పడుతుందన్నారు. న్యాయ నిపుణులు, వివిధ తరగతులకు చెందిన మేధావుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా క్రిమినల్ చట్టాలను మార్చడం తగదన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ఈ చట్టాల్లో పలు లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాల్లోని కొన్ని నిబంధనలు భావ ప్రకటనా స్వేచ్ఛకు ఆటంకంగా ఉన్నాయని, న్యాయవాద వృత్తిలో ఒత్తిడికి గురయ్యే విధంగా ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేకమైన కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌జి.కుమార్, న్యాయవాదులు పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి (బాబ్జీ), దేవ రంజిత్‌కుమార్, నల్లమిల్లి జోసెఫ్, పూరిళ్ల శ్రీనివాస్, చేగొండి బాలాజీ, నెక్కంటి క్రాంతికుమార్, కొప్పినీడి చిట్టి పద్మజ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులకు తక్షణం పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన ఫిర్యాదు మళ్లీ రావడం ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి మన మీద ఎంతో నమ్మకంతో వస్తారని, వారి నమ్మకాన్ని ఏ మాత్రమూ సడలని విధంగా కచ్చితమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ ఉన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా 107 వినతులు స్వీకరించామని తెలిపారు.

పోతుమూడి చిన్నారి ఫిర్యాదు చేస్తూ తాను కువైట్‌లో ఉంటున్నాననీ, అక్కడ నుండి తన పిల్లల పోషణ, చదువు నిమిత్తం చాలా డబ్బు తన భర్త పోతుమూడి రామారావుకు పంపడం జరిగిందని, డబ్బు వృథా చేసి పిల్లలను సరిగ్గా చూడడం లేదని, భర్తపై తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. భీమవరం నివాసి నక్క భావన ఫిర్యాదు చేస్తూ తన తండ్రి ఉమ్మడి ఆస్తి 2.24 సెంట్ల భూమి తన అన్నయ్య ఒక్కరే అనుభవిస్తున్నాడని, తనకు రావాల్సిన వాటా భూమిని ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరవాసరం మండలం కొణితివాడ నివాసి చింతపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేస్తూ నడుపూరు సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పరిశుభ్రతతోనే డయేరియా నివారణ

పరిశుభ్రతతోనే డయేరియాను అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం అంబేద్కర్ సెంటర్ నుంచి స్టాప్ డయేరియాపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అతిసారను అదుపుచేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అతిసారను అరికట్టేందుకు నేటి నుంచి ఆగస్టు 31 వరకూ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు ప్రతిరోజూ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, పిల్లల ఆరోగ్యంపై ఆరా తీయాలని, అవసరమైనవారికి ఒఆర్ఎస్, జింకు మాత్రలను పంపిణీ చేయడంతోపాటు, వారికి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. అతిసార కారణంగా జిల్లాలో ఒక్క మరణం కూడా సంభవించకుండా, అన్ని ప్రభుత్వ శాఖలూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ కొనసాగింది. ఈ ర్యాలీలో డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల పాల్గొన్నారు.

స్టాఫ్ డయేరియా సమాచారం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజా సమస్యల ఫిర్యాదుల కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ నాగరాణి ఆవిష్కరించారు. అలాగే ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్ల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

నాయకర్‌ను విప్‌గా నియమించాలని..
సిఎంకు పవన్ లేఖ


ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు అధికార విప్‌గా ప్రకటించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. నాయకర్ బిసి సామాజిక తరగతికి చెందిన నాయకుడు. ఆయన 2019 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో 49 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

జిఒ 117ను రద్దు చేయాలి

గణపవరం విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేయాలి
యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి


మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం జిఒ 117ను రద్దు చేయాలని, హైస్కూల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం సమానంగా కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రభుత్వం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హైస్కూళ్లు, పాఠశాలలో జరిగిన యుటిఎఫ్ సభ్యత్వం క్యాంపెన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గణపవరం మండల విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేయాలన్నారు. ఇప్పటివరకూ విలీనం చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు పలు అంశాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మకు వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే అమలు చేయాలన్నారు. స్కూల్ మెర్జింగ్‌ను రద్దు చేయాలని, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు ఒకే సిలబస్ అమలు చేయాలని కోరారు. మండలంలో యుటిఎఫ్‌ను బలోపేతం చేయడానికి సంఘం నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు జె.నాని, జి.భవానిప్రసాద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎస్.రత్నరాజు, హెచ్ఎస్‌వివి.ఆంజనేయులు, అసోసియేట్ అధ్యక్షులు హెచ్‌డి ప్రసాద్, కోశాధికారి శర్మ, నాయకులు వెంకటేశ్వర్లు, నాగభూషణరావు, సూర్యనారాయణ, రామచంద్రరావు పాల్గొన్నారు.

గొప్ప ప్రజా నాయకుడు కొరటాల

సిపిఎం జిల్లా కార్యదర్శి బి బలరాం



కొరటాల సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడిన గొప్ప ప్రజా నాయకుడు కొరటాల సత్యనారాయణ అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కొనియాడారు. సిపిఎం అగ్రనాయకులు కొరటాల సత్యనారాయణ వర్ధంతి సభ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ కొనియాడారు. కొరటాల కేంద్ర కమిటీ సభ్యులుగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శిగా, విద్యార్థి, యువజన నాయకునిగా విశేష సేవలందించారన్నారు. రాష్ట్రంలో రైతాంగ ఉద్యమం నిర్మించడంలో ప్రధానపాత్ర పోషించారన్నారు. గతంలో పత్తి రైతుల ఆత్మహత్యలు, రైతులు కిడ్నీలు అమ్ముకోవడం ఇలాంటి విషయాలన్నీ రైతు సంఘం నేత బోడేపూడి వెంకటేశ్వరరావుతో కలిసి ఈ విషయాలు వెలికితీయడంలో ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయడంలో, రైతులకు సహకారాన్ని అందించడంలో కొరటాల సత్యనారాయణ గారు ప్రధాన పాత్రని వహించారని తెలిపారు. నాయకుల ఉద్యమ అనుభవాలతో కార్యకర్తలు ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, పార్టీ సభ్యులు ఎం.ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎఫ్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి


కొనసాగిన సిపిఎఫ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లి సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని ఉద్యోగ, కార్మికులు సోమవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికే తాము 25 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే తమకు వేతనాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను సిఐటియు నాయకత్వంలో పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇప్పటివరకూ ఫ్యాక్టరీ యాజమాన్యం గానీ, జిల్లా అధికారులు గానీ తమ సమస్యపై ఎలాంటి చర్చలూ జరపకపోవడం ప్రభుత్వానికి కార్మికుల పట్ల ఎంత బాధ్యత ఉందో అర్థమవుతోందని తెలిపారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

'సమాజంలో వైద్యుల పాత్ర కీలకం'

ఉండి: సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమైనదని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం ఉండి కూనపరాజు అప్పలరాజు, సేతమ్మ లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షులు సత్తి బ్రహ్మరెడ్డి అధ్యక్షత వహించారు. అక్కడ, కార్యదర్శులు సత్తి బ్రహ్మరెడ్డి, ముదునూరి శివ రామ రాజులు మాట్లాడుతూ వైద్యులు నిబద్ధతతో సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ప్రముఖ సహాయ గైనకాలజిస్ట్ ప్రభుత్వ వైద్యులు ముదుండి సుబ్బలక్ష్మి(భీమవరం), ప్రముఖ చర్మ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ కాగిత శ్రీనుబాబు(పాలకొల్లు)లను శాలువా, పూలమాల, మెమెంటో, స్వీట్ బాక్స్‌తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పోతిరెడ్డి నరసింహ రావు, కూనపరాజు రామరాజు, భూపతిరాజు హరినాథ్ రాజు పాల్గొన్నారు.

డ్రెయిన్లు పరిశీలన

ఆకివీడు: ఆకివీడు దిగువ కొల్లేరు కాంటూరు ప్రాంతాల్లో వాన నీటి ముంపున బారిన పడే అవకాశం ఉన్న పంటచేల్లో పంట, ముసుగు కాలువలను డిఇఇ హిమ శైలజ ఆదివారం పరిశీలించారు. కాంటూరు పరిధిలో ఉన్న డ్రెయిన్లు పూడుకు పోవడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోయి ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని కొల్లేరు ప్రాంత రైతులు ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన డ్రెయిన్ల పరిస్థితి చూసి పూర్తిస్థాయిలో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని కొల్లేరు అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు కాంటూరు పరిధిలో ఉన్న బీరద చేడు, ఐసా కాలువ, పాత ఏరు, ఓల్డ్ వయ్యేరులను డిఇఇ హిమ శైలజ పరిశీలించారు.

అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

వీరవాసరం: వీరవాసరం నారాయుడుచెరువు గట్టుపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ వీరవాసరం మండల రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు పాకాలేటి లక్ష్మణరావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. అప్పికొండ నర్సింహమూర్తి అనే వ్యక్తి చెరువు స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేస్తున్నాడని, ఈ విషయం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'కమీషన్లు కాదు ప్రజా శ్రేయస్సు ముఖ్యం'

తాడేపల్లిగూడెం: తమకు కావాల్సింది కమిషన్లు కాదని ప్రజల శ్రేయస్సు ముఖ్యమని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం పడమర విప్పరులో రూ.7 కోట్లతో రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎంపీ నిధుల నుంచి తాము రూ.30 లక్షలు ఇప్పిస్తామని చెప్తే తామే సీసీ రోడ్డు నిర్మించుకుంటామంటే అప్పటి వైసిపి నాయకులు తమను అడ్డుకున్నారన్నారు. కానీ నేడిక ఆ రోడ్డు లేకపోవడం వారి దిక్కుతోచక దోహదపడుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి పార్టీలతో సంబంధం లేకుండా సహకరించాలని తెలిపారు. అనంతరం విప్పరు గ్రామంలో ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ పంపిణీ చేశారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ

పెనుగొండ: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికలఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ ఎస్తేర్ క్వీన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పెనుగొండ సర్పంచి నక్క శ్యామల సోనీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యాబోధన, క్రమశిక్షణ నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు, కనక దుర్గ, మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐ సీతారామయ్య మృతి

పాలకొల్లు : పాలకొల్లు రిటైర్డ్ పోలీస్ ఎస్ఐ ఎం.సీతారామయ్య(89) సోమవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు కుమార్తె, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన వృద్ధాప్యంతో దీర్ఘ కాలంగా అస్వస్థతతో ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు సాంబశివరావు జర్నలిస్టుగా, చిన్న కుమారుడు నాయుడు హోంగార్డు కమెండర్‌గా ఉన్నారు. ఆయన మృతి పట్ల పాలకొల్లు ప్రెస్ క్లబ్ సభ్యులు, పోలీసులు, వివిధ పార్టీల నేతలు సంతాపం తెలిపి భౌతిక కాయాన్ని సందర్శించారు.

'మహిళలు అన్ని రంగాల్లో ముందంజ'

పాలకొల్లు: మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని మాజీ గవర్నర్ డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కొయ్యా జయ భారత్ రెడ్డి బాధ్యతలు తీసికొన్నారు. కార్యదర్శిగా అందే భాను ప్రకాష్, కోశాధికారిగా టివిఆర్ సురేష్ భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన సభలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథి విచ్చేసిన విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పాలకొల్లు లయన్స్ క్లబ్ జిల్లాలో ఆదర్శ క్లబ్ అన్నారు. ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహారావు, అసిస్టెంట్ గవర్నర్ పాల్గొన్నారు.

వైఎస్ పాలెంలో పోస్టాఫీస్ ప్రారంభం

నరసాపురం: యర్రంశెట్టి వారి పాలెం గ్రామంలో సోమవారం పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని భీమవరం సీనియర్ సూపరిడెంట్ ఎన్‌వి.సత్యనారాయణ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ అంటే ఉత్తరాలు పంచడమే కాకుండా పోస్ట్ ఆఫీస్‌లో అకౌంటు ఉంటే ఇంటి వద్దకే మీ ఖాతా నుంచి డబ్బు ఇచ్చే సౌకర్యం కలుగుతుందన్నారు. సుకన్య యోజన పథకం అర్హులు పోస్ట్ ఆఫీస్‌లో తమ ఖాతాలకు జమ చేసుకోవచ్చని తెలిపారు. సర్పంచి నాగ ముత్యమాంబ, బాబులు సీనియర్ సూపరింటెండెంట్ సత్యనారాయణ రాజుని శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి అభినందించారు.

రైల్వే లైన్ కావాలని విజ్ఞప్తి

నరసాపురం: వైఎన్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్, జనసేన సీనియర్ నాయకులు డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయనతో మాట్లాడుతూ నరసాపురం నుంచి మచిలీపట్నంకు రైల్వే లైన్ నిర్మాణాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఒక ప్రకటనలో తెలిపారు.

బొండాడ డ్రెయిన్‌లో మునిగిపోయిన తెప్ప, పొక్లెయిన్స్

తృటిలో తప్పిన ప్రమాదం

ఉండి: బొండాడ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కను తెప్ప మీద నుంచి తొలగించేందుకు దిగిన ప్రొక్లెయిన్ స్థానిక బొండాడ డ్రెయిన్‌లో స్థానిక మసీదు సమీపంలో మునిగిపోయింది. అక్విడెక్ట్ దిగువ బాగా పేరుకుపోయి ఉన్న మేటను తొలగించేందుకు స్థానిక మసీదు వంతెన దగ్గర నుంచి కాలువలో తెప్ప ఉంచి వాటిపై ప్రొక్లైన్ ఏర్పాటు చేశారు. కాగా పని ప్రారంభించే ముందు పలువురు టిడిపి నాయకులు తెప్పపై నిలబడి ఫోటోలు దిగేందుకు సిద్ధమవుగా ఇంతలో ప్రొక్లైన్‌తో పనికి ఉపక్రమించడంతో తెప్ప ఒక్కసారిగా ఒరిగిపోయింది. దీంతో ప్రొక్లైన్ ఆపరేటర్ చాకచక్యంగా వ్యవహరించి తొండంతో నీటిలో అదిమిపెట్టారు. ఈ ప్రమాదంలో ఏ విధమైన ప్రాణనష్టం జరుగకపోవడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం నూతన ఇఒగా శ్రీనివాస్

పాలకొల్లు: పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారిగా ముచ్చర్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు విజయవాడ నుంచి ఉత్తర్వులు జారీ కాగా ఆయన సోమవారం భాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న యాళ్ల సూర్యనారాయణ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాల మెరుగుదలకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

క్రీడల్లో మాంటిస్సోరి విద్యార్థుల విజయకేతనం

తణుకు: మాంటిస్సోరి స్కూల్‌కు చెందిన విద్యార్థులు క్రీడల్లో విజయకేతనం ఎగురవేశారని స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేది వరకు కృష్ణా జిల్లా విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్, చెరుకూరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ 14వ మిని అండర్-13(ఓపెన్), 6వ కిడ్స్ అండర్-9(ఓపెన్) అంతర్ జిల్లా రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా స్టేట్ లెవెల్ అండర్-10 కర్రి కోమలి స్పందనారెడ్డి(4వ తరగతి) కాంపౌండ్ రౌండ్‌లో రెండవ స్థానం, వెండి పతకాన్ని, ఆళ్ల శారద(2వ తరగతి) కాంపౌండ్‌లో 6వ స్థానం, స్టేట్ లెవెల్ అండర్-10 ఇండియన్ రౌండ్‌లో సిహెచ్.హర్షద్(4వ తరగతి) 4వ స్థానం సాధించారు. వీరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనారని తెలియజేశారు.

ఘనంగా పింఛన్ల పంపిణీ


ఆచంట: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - పాలకోడేరు

వేంద్ర గ్రామంలో మాజీ ఎంపిపి పాల వెంకట చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మాజీ ఎంపిపి పాల వెంకట చలపతి, టిడిపి ముఖ్య నేతలు మందపాటి రామరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండలంలోని ఐదు పంచాయతీల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సంబరాలు జరుగుతాయని ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. ఈమేరకు మండలంలోని పొలమూరు, మాముడూరు, గరువు, పెనుమంట్ర, జుత్తిగ గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ పెన్షన్ మొత్తం పెంచి, ఉదయాన్నే వారికి అందించామని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం ఉదయం పెనుమంట్ర మండలం


నరసాపురం: పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ నాయకర్


లోని పొలమూరు, మాముడూరు, గరువు, పెనుమంట్ర, జుత్తిగ గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.

గణపవరం: ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం టిడిపి అని ఉంగుటూరు ఎంఎల్ఎ పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం మండలంలోని సరిపల్లి సచివాలయం వద్ద లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.రాంబాబు, ఎంపిడిఒ సూర్యనారాయణ, మండలాధికారులు ఉన్నారు.

మండలంలోని పింఛన్ల పంపిణీలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం గ్రామ అధ్యక్షులు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, కాపవరం చిన్న అద్దేపల్లి వాసురాజు పాల్గొన్నారు.

ఉండి: మండలంలో వేకువ జాము నుంచి పెన్షన్ లబ్ధిదారులకు అందించడం జరిగిందని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. అన్ని గ్రామ పంచాయతీల ప్రాంగణంలో లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య పర్యవేక్షించారు.

ఆచంట: మండలంలోని ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం గ్రామాల్లో ఆయన లబ్ధిదారులకు నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని, ఎంపిపి దిగమర్తి


ఉండి : పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ రఘురామ

సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపిపి ఎర్రగొప్పుల నాగరాజు పాల్గొన్నారు.

కాళ్ల: ఎన్‌టిఆర్ పేరుతో పింఛన్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ల గ్రామంలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బందా విజయ, ఉప సర్పంచి అబ్బులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తికి నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం పండగలా నిర్వహించారు. నిర్దేశించిన సిబ్బంది కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. మొగల్తూరులో ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో


తణుకు: పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి


పాల్గొన్నారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కెపి పాలెం, పేరుపాలెం, పాటపాడు, మొగల్తూరు, రాములపాలెం, శేరేపాలెం తదితర గ్రామాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మెండు రాజేష్, బొక్క చంటి, లక్కు శేషు, పంపన భగవాన్ ఉన్నారు.

ఆకివీడు : మండలంలోని అయిభీమవరం గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. టిడిపి నేతలు ఎన్‌టి రామారావు, చంద్రబాబు, మోడీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ నాగరాజు, స్థానిక ప్రముఖులు చాంబర్ ఆఫ్ కామర్స్ మండల అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపు

సర్వర్ మొరారించడంతో పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడవలసి వచ్చింది. ఉదయం 6:30 నుంచి 11:00 వరకు చురుగ్గా సాగిన ఈ కార్యక్రమం ఆ తర్వాత ఆగిపోయింది. మొత్తం మీద మధ్యాహ్నం చాలా ఆలస్యంగా సర్వర్ అందుబాటులోకి రావడంతో వరకు ఈ పంపిణీ కొనసాగించారు.


వీరవాసరం: ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం పెన్షన్ పెంపుదలను అమలు చేస్తున్నామంటూ భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండల వ్యాప్తంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. వీరవాసరం, బొబ్బనపల్లి, మత్స్యపురి గ్రామాల్లో ఎంఎల్ఎ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కారిపెల్లి


గణపవరం : పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

శాంతిప్రియ, ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మీ, చింతా కనకయ్య, పిప్పళ్ల నాని, యరకరాజు హరిబాబు, వీరవల్లి చంద్రశేఖర్, ఎంపిడిఒ విజయసారథి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్: మండలంలోని దొంగ పిండి, కొత్త పూసలమర్రు, గుట్లపాడు, తోకతిప్ప గొల్లవానితిప్ప గ్రామలు, భీమవరం పట్టణం బలుసుమూడిలోని వార్డులలో ఎన్‌టిఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డ్వాక్రా, అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంద్ర శ్రీనివాస్, దొంగపిండి గ్రామ సర్పంచి బోడ్డు రేవతి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పేదలకు పింఛన్లు అందించడం ప్రభుత్వ బాధ్యతని, వారిపన్నుల రూపంలో చెల్లించిన సొమ్ములు వారికి అందించడం జరుగుతుందని


వీరవాసరం : పింఛన్ అందిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు


తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నరసాపురం : సోమవారం ఉదయం నుంచే మండలంలోని మండలం గొంది, పెదమైనవనిలంక పసలదీవి, కొప్పర్రు గ్రామాలో, నరసాపురం పట్టణం 1, 8, 25వ వార్డుల్లో ఎంఎల్ఎ పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి ఇన్‌ఛార్జి మేకల సతీష్, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనుగొండ: మండలంలోని పెనుగొండ గ్రామపంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నక్క శ్యామల సోనీ, మాజీ ఎంఎల్‌సి మల్లు లక్ష్మీనారాయణ, వెలిచేటి బాబురాజేంద్రప్రసాద్, కార్యకర్తలు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


తణుకు: నియోజకవర్గంలోని తణుకు పట్టణం, వేల్పూరు, రేలంగి, అత్తిలి గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

పోడూరు: ఇది నిజమైన ప్రజా ప్రభుత్వమని గర్విస్తూ, ప్రజల సొమ్మును వారి సంక్షేమానికి పంచడానికి టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తమ గ్రామానికి వచ్చారని


తాడేపల్లిగూడెం : పింఛన్ అందిస్తున్న బొలిశెట్టి

ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుమ్మలురు, పోడూరు, కవిటం గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి.సుహాసిని, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల 'స్టాప్ డయేరియా'


కాళ్ల: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

డయేరియా నియంత్రణ కోసం జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలలపాటు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించి, పటిష్టవంతమైన చర్యలు చేపట్టాల్సి ఉందని కాళ్ల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అన్నారు. సోమవారం కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియాపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరాబు సునీల్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీళ్ళు, క్లోరినేషన్ అయిన నీళ్ల మాత్రమే తాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ.విజయవతి, పిఎన్ సి.చండిరాణి, ఎంపిహెచ్ ఇఒ పాల్సన్, హెచ్‌విలు పాల్గొన్నారు.

ఉండి: ప్రతిఒక్కరు డయేరియా నివారణ చర్యలు తప్పకుండా పాటించాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బి.సాయి చంద్ర అన్నారు. సోమవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సాయిచంద్ర ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఎం.రామకృష్ణారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య విస్తరణ అధికారి కృష్ణ కుమార్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామాల్లోని ప్రతిఒక్కరూ డయేరియా నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఒ.దినేష్ కుమార్ సూచించారు. సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె.లక్ష్మీపార్వతి, ఆరోగ్యశాఖ సిబ్బంది ఉన్నారు.

గణపవరం: గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు పిహెచ్‌ఆర్ఎస్ సంతోష్, పి.కిరణ్మయి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, హెచ్‌వి.పద్మజ పాల్గొన్నారు.

వీరవాసరం: అతిసార పట్ల అవగాహనతో ఉండాలని కొణితివాడ ప్రాథమిక వైద్యాధికారి యు.నవనీత్ అన్నారు. స్టాప్ డయేరియా మహోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ప్రభాకరరావు, సత్యవతి, రవికుమార్, చిట్టిబాబు, కె.కుమార్, ఆశలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : చిన్న పిల్లలు, వృద్ధులు అతిసార వ్యాధికి గురికాకుండా జాగ్రత్త వహించాలని పెనుమంట్ర ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. సోమవారం స్థానిక పిహెచ్ సి ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ప్రతి ఒక్కరు కాచి, చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

నరసాపురం: ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ ప్రజల నుంచి 18 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదుదారుడు సంతృప్తి పడేవిధంగా పరిష్కారం చేయాలని సూచించారు. అర్జీదారులు పదేపదే సమస్యలు పరిష్కారం కాలేదని కార్యాలయాలకు రాకూడదని అధికారులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

ఆకివీడు: ముంపునకు గురయ్యే నివాస ప్రాంతాలు వెంటనే పరిశీలించి, అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో నివాస ప్రాంతాలు ముంపుకు గురయ్యాయన్నారు. కాగా ఇప్పటికే రైతులు విత్తనాలు చల్లి నారుమడ్లు సిద్ధం చేసుకున్నవి కొన్ని ముంపునకు గురయ్యాయని, మరికొన్ని ఇప్పటికే మొక్క వచ్చాయని, ఆ మొక్క సైతం అధిక నీరు నిల్వ ఉంటే కుళ్లిపోతుందని అన్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగి ప్రమాదాలకు నెలవుగా మారాయన్నారు. ఇప్పటికీ విత్తనాలు అందని రైతులకు తక్షణమే విత్తనాలు అందించి సహకరించాలని కోరారు. వర్షాకాలంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై దృష్టి సారించాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో దోకల రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, బొక్క వర్మ, గేదెల ధనుష్ పాల్గొన్నారు.

'స్వచ్ఛంద సంస్థల ప్రగతిలో సభ్యుల పాత్ర కీలకం'

ఆచంట: స్వచ్ఛంద సంస్థలు ప్రగతి దిశగా ప్రయానించాలంటే భాగస్వాములైన సభ్యుల పాత్ర కీలకమని మానవత జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆచంట మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి ఆచంట కమ్మ సంఘం కళ్యాణమండపంలో మానవత సమన్వయకర్త బుద్ధిరాజు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మానవత కార్యకలాపాలకు ప్రజల స్పందన అనూహ్యంగా ఉందన్నారు. మానవత అందిస్తున్న శాంతిరథం, ఫ్రిజరు, ఇతర సేవా కార్యక్రమాలను అభినందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులుగా కుక్కల లీలా ప్రసాద్, కార్యదర్శిగా నిమ్మకాయల గంగారామ్, ట్రెజరర్ తమ్మినేడి సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా బొక్క రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా మానేపల్లి వెంకటేశ్వరరావు, అంజూరి శ్రీనివాస్, షేక్ ముజబుల్ రెహమాన్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

'కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా శ్రమజీవులైన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల చిత్త శుద్ది లేదని వీరభద్రరావు విమర్శించారు. గతంలో కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయవలసిన ప్రభుత్వాలు గతంలో చంద్రన్న బీమా అమలుకు టిడిపి, నవరత్నాల పేరుతో వైసిపి బోర్డులో ఉన్న నిధులను దారి మళ్లించి, నిర్మాణ కార్మికులకు మొండి చెయ్యి చూపాయని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిల్డింగ్ మెటీరియల్ ధరలు తగ్గించాలన్నారు. సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో సోరపల్లి రామకృష్ణ, తిరునాదం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: కొత్త ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ ఆశాభావం వ్యక్తంచేశారు. సోమవారం జరిగిన ఎల్.అగ్రహారం గ్రామ భవన నిర్మాణ కార్మికసంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా దంగేటి నారాయణరావు, గౌరవ సలహాదారునిగా పాలూరి సుబ్రహ్మణ్యం, అధ్యక్షునిగా దయ్యం పాండు రంగారావు, కార్యదర్శిగా కామిరెడ్డి కృష్ణ జగన్నాథం, కోశాధికారిగా మంచాల ఏసు, సహాయ కార్యదర్శులుగా ఉల్లి పాండురంగ, బసివిరెడ్డి సురేష్, కార్యవర్గ సభ్యులుగా పప్పొప్పుల పాండురంగ, పప్పొప్పుల రమణ, పపొప్పుల కృష్ణ , మంచాల నాగరాజు, మంచాల శివ ఎన్నికయ్యారు.

శారీరక ఆరోగ్యం ఎంతో ముఖ్యం

డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - నరసాపురం


డాక్టర్‌ని సత్కరిస్తున్న విద్యార్థులు

ప్రతి ఒక్కరూ బాల్యమునుంచే చదువుతో పాటు, ఆటలు కూడా ఆడుతూ ఉండటం వల్ల శరీర ఆరోగ్యము సాధ్యమవుతుందని ప్రముఖ డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక నరసాపురం ఆదిత్య పాఠశాలలో నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మాదంశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదమును విశదీకరిస్తూ, మానసిక వికాసం పెంపొంది తద్వారా వ్యక్తిత్వ వికాసం ఏర్పడుటకు దోహద పడుతుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతతో ఉండి ముందుగానే తగు జాగ్రత్తలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్‌ని సన్మాన సత్కారాలతో గౌరవించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్‌వి.రాఘవరెడ్డి సమాజంలో డాక్టర్ ఆవశ్యకతను గురించి సవివరంగా తెలియజేశారు. ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శివకోట ప్రసాద్, డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.